ప్రగతి వైపు పరుగులు

- 52వ వార్డులో అభివృద్ధి జోరు
- రూ.1.32 కోట్లతో పనులకు కౌన్సిల్ ఆమోదం
- పార్కుల సుందరీకరణ, రహదారులు, కాలువల నిర్మాణాలు



శాంతినగర్‌లో రహదారి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్(ఫైల్)

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సారథ్యంలో వార్డులో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పనులు చకచకా జరుగుతున్నాయి. ఇందులో ప్రధానంగా పార్కులు, శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. వార్డులో రహదారులు, కాలువల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వీటితోపాటు ఇటీవల జీవీఎంసీ కౌన్సిల్‌లో రూ.1.32 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది.

కొత్త పనులు.. నిధులు

- వార్డులోని గౌరీనగర్‌లో పారిశుధ్య కార్యాలయం పైన అదనపు అంతస్తులో రూ.32.40 లక్షలతో సచివాలయ భవనం నిర్మించనున్నారు.
- మద్రిపాలెం వుడా లేఅవుట్ పోస్టాఫీస్ వద్ద రూ.33.20 లక్షలతో ప్రధాన కాలువ నిర్మాణం.
- కరాసాలో రూ.28 లక్షలతో వరద నీటి ప్రధాన కాలువ నిర్మాణం.
- గణేష్‌నగర్ నుంచి గౌరీనగర్ వరకు మురుగు కాలువ నిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరయ్యాయి.

పూర్తయిన, జరుగుతున్న పనులు

- మద్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్ అభివృద్ధి, మోడల్ లైటింగ్ పనులు పూర్తి చేశారు.
- శాంతినగర్ పార్క్, కరాసా పార్కులను సుందరీకరించారు. పిల్లల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. పచ్చదనాన్ని పెంపొందించారు. ఈ పార్కుల్లో మోడల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.
- శాంతినగర్ రహదారులను అభివృద్ధి చేశారు.
- గౌరీనగర్‌లో సీసీ రోడ్ల పనులు పూర్తి చేశారు.
- గౌరీనగర్‌లో శానిటరీ వార్డు కార్యాలయం పనులు జరుగుతున్నాయి.
- కరాసా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతా..



జీవీఎంసీ 52వ వార్డును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నా. ఇటీవల కౌన్సిల్‌లో రూ.1.32 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది. మద్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేశాం. దీన్నే ఆదర్శంగా తీసుకుని నగరంలో పలు చోట్ల గ్రీన్‌బెల్ట్‌లను సుందరంగా తయారు చేస్తున్నారు. పార్కులు, శ్మశానవాటికలు, రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. రైల్వే స్థలాల్లో ఉన్న ప్రధాన కాలువల సమస్య, ఎయిర్‌పోర్టు స్థలంలోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం.
– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్, జీవీఎంసీ

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



మల్కాపురంలో వరలక్ష్మీ వ్రతమాచరిస్తున్న మహిళలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లల్లో అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలకంరించారు. పసుపు, కుంకుమలతో మహిళలు పూజలు జరిపారు. వివిధ పిండివంటలను తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. శ్రీహరిపురం, మల్కాపురం ప్రాంతాల్లోని ఇళ్లల్లో వరలక్ష్మీ అమ్మవారి ప్రతిమలను నెలకొల్పి మహిళలు వ్రతమాచరించారు. అమ్మవారి కీర్తనలను ఆలపించారు. స్థానిక హరి హర క్షేత్రం, చింతామణి దుర్గాగణపతి ఆలయం వద్ద కొలువుదీరిన మహాలక్ష్మి దేవి పీఠంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

కంచరపాలెం: కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గొల్ల కంచరపాలెం ధనలక్ష్మీదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్యామాచార్యులు అమ్మవారిని విశేషంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీహరిపురంలో పూజలందుకున్న అమ్మవారు



గొల్ల కంచరపాలెంలో ప్రత్యేక అలంకరణలో ధనలక్ష్మీ దేవి

ఆధునిక ఔషధాలతో క్యాన్సర్ నివారణ



డాక్టర్ మాధవిని సన్మానిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : క్యాన్సర్ వ్యాధి నివారణకు అధునాతన పద్ధతులు, ఔషధాలు వచ్చాయని అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రముఖ మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ గొరుసు మాధవి అన్నారు. శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్ టీచింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'ప్రివెన్షన్ మెడిసిన్–అంకాలజీ'అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాల వల్ల ప్రపంచంలో క్యాన్సర్ వ్యాధి పెరుగుతోందని అన్నారు. మద్యం, ధూమపానం, వంశపారంపర్యంగా ఈ వ్యాధి సోకుతోందన్నారు. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, ఏఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, డాక్టర్ పీఎస్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవిని ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

సకల కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడిగా 'కంచెర్ల'

ఆరిలోవ: విశాఖ సకల కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడిగా ఉపకార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కంచెర్ల అచ్యుతరావు ఎన్నికయ్యారు. శుక్రవారం ఆరిలోవ ట్రస్ట్ కార్యాలయంలో సకల కళాకారుల సంఘం సభ్యులు సమావేశమయ్యారు. ఈ మేరకు అచ్యుతరావుకు సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న దర్శనం చేయిస్తానని భక్తుడికి టోకరా



హైదరాబాద్ నుంచి కుటుంబసమేతంగా దర్శనానికి వచ్చిన భక్తుడు శ్రీరామమూర్తి

సింహాచలం: సింహగిరికి వచ్చిన ఓ భక్తుడికి వరాహ లక్ష్మీ నృసింహస్వామి వీఐపీ దర్శనం కల్పిస్తానని చెప్పి ఓ అజ్ఞాత వ్యక్తి టోకరా వేశాడు. హైదరాబాద్ నుంచి శ్రీరామమూర్తి తన భార్య, కుమారుడితో కలిసి శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో సింహగిరికి వచ్చారు. పాత విచారణ కార్యాలయం వద్ద వారిని ఓ అజ్ఞాత వ్యక్తి కలిసి వీఐపీ దర్శనం, ఆశీర్వచనం, ప్రసాదం అందజేస్తానని చెప్పి రూ.900 తీసుకున్నాడు. అక్కడే ఉండమని చెప్పి వెళ్లాడు. అతని కోసం ఎదురుచూసిన శ్రీరామమూర్తి ఎంతకీ రాకపోయేసరికి.. సింహగిరిపై ఉన్న సహాయక కేంద్రంలో పీఆర్వో అప్పలనాయుడికి ఫిర్యాదు చేశారు. పీఆర్వో, సిబ్బంది సింహగిరిపై అతని కోసం గాలించారు. ఫలితం లేకపోయింది. అతన్ని గుర్తించేందుకు దేవస్థానం సిబ్బంది సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

అట్టహాసంగా ఓనం వేడుకలు



ఇండియన్ మారిటైమ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఓనం పర్వదిన వేడుకలు



సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

సబ్బవరం: ఇండియన్ మారీ టైం విశ్వవిద్యాలయంలో వరలక్ష్మీవ్రతం,ఓనం పర్వదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ డైరెక్టర్ వీకే కేశవదేవ్ ఓనం ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. సిరిసంపదలను తీసుకువచ్చే ఎంతో సంతోషమైన రోజు అని తెలిపారు. పండగను పురస్కరించుకొని వర్సిటీలో రంగవల్లులతో అలంకరించి,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీల్లో భాగంగా విద్యార్థుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సాంప్రదాయ వంటలతో ఏర్పాటు చేసిన విందు భోజనాలతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ ఎస్. జనార్దనన్,అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి చరణ్, జె. రాజు, ప్రొఫెసర్స్ శ్రీ పద్మ, ఎం. ప్రేమ్ చంద్,జి. అవినాష్, ఎ. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం మొండి వైఖరి విడనాడాలి



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ఒకటైన విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి, ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 925వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎంఎంఎస్ఎం మరియు ఎస్టీఎం విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎందరో వీరుల ప్రాణత్యాగాలు, పోరాటాల ద్వారా నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే ప్రజలు సహించేది లేదన్నారు. పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, రాయితీలను సమసమాజ స్థాపనకు ఉపయోగపడే విధంగా చేస్తామని ప్రమాణం చేసి.. నేడు కార్మికుల హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యా యత్నం

రక్షించిన భీమిలి పోలీసులు



రక్షించిన వ్యక్తితో భీమిలి పోలీసులు

భీమునిపట్నం: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని భీమిలి పోలీసులు గురువారం రాత్రి రక్షించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. పెందుర్తి చినముషిడివాడకు చెందిన పాట్నూరు రవితేజ (34) ఆన్‌లైన్ ఆటలకు బానిసై సుమారు రూ.15లక్షల వరకు బ్యాంకుల దగ్గర అప్పు చేశాడు. వారి నుంచి ఒత్తిడి పెరగడంతో స్విగ్గీ డెలివరీకి వెళ్తున్నానని సాయంత్రం 7 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 10.30 గంటల సమయంలో అప్పుల వివరాలు, తప్పులు తన బావకు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టి, సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకుంటానని తెలిపాడు. దీంతో వారు 100కి ఫోన్ చేయడంతో నైట్ డ్యూటీలో ఉన్న ఎస్‌ఐ హరీష్, ఇతర పోలీసు సిబ్బంది గాలింపు చేపట్టారు. భీమిలి బీచ్‌రోడ్డులో ఎర్రమట్టి దిబ్బల ఎదురుగా సదరు వ్యక్తిని రక్షించారు. అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.

క్లుప్తంగా

జాబ్ మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. రక్షిత డ్రగ్స్, ఏడీఎల్ ఆగ్రో ఫార్మా, ఆటోమోటివ్ మ్యానిఫ్యాక్చర్స్, రక్షిత్ ఫార్మాసిటికల్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మొదలగు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 282 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు జరిగాయి. వీటికి 297 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 74 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన వారి సర్టిఫికెట్లను పరిశీలించి, సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిలో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ.సంగీత, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విభిన్న రంగాల మహిళలకు సత్కారం



మహిళలను సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో శ్రావణమాస రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పర్వదినం పురస్కరించుకుని ఆ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సత్కరించరారు. ముందుగా శ్రావణ లక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారితో పాటు వివిధ రంగాల్లో స్థిరపడిన మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వివిధ రంగాల్లో దూసుకుపోతున్న మహిళలను సాక్షాత్తూ లక్ష్మీదేవిగా భావించి తన చేతులమీదుగా సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సత్కారం అందుకున్న వారిలో కార్పొరేటర్లు కొణతాల సుధ, గులివిందల లావణ్య, పుర్రె పూర్ణశ్రీ, గుడివాడ అనూష, శ్రీకనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ మళ్ల ధనలత, వ్యవసాయశాఖ మార్కెటింగ్ సభ్యురాలు తోసంగి వెంకటరమణి, పీలా మాధవి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో రామాలయం ప్రధాన అర్చకులు శ్రీనివాసపంతులు, పీలా అనంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మద్రిపాలెం: ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్–4లో నివసిస్తున్న గొర్లె పవన్(29) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్యతో ఎటువంటి విభేదాలు లేవు. బీటెక్ చదివి కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. ప్రస్తుతం ఉద్యోగం ఏమీ చేయడం లేదు. శుక్రవారం మృతుడి తండ్రి గొర్లె రామారావు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్దం కేసు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల లేక అనారోగ్య సమస్యలా అన్న కోణంలో మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

కళాభారతిలో నృత్యోత్సవం నేడు

మద్దిలపాలెం: సంస్కృత కథక్ విద్యాలయం ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం పంచ వర్ష నృత్యోత్సవం నిర్వహించనున్నామని నిర్వాహకుడు వెంకటరమణ తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకకు అందరూ ఆహ్వానితులేనన్నారు. కథక్ నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి జాగరణ దీక్ష

సింధియా: రక్షణ రంగ కార్మిక వర్గ సమస్యల పరిష్కారం దిశగా డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నేవల్ బేస్ ప్రధాన గేటు వద్ద కార్మికులు, ఉద్యోగులు జాగరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ తూర్పు నౌకాదళ ప్రధాన అధికారికి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన పోస్టుకార్డ్ క్యాంపెయిన్‌ను జయప్రదం చేసిన కార్మికులు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. జాగరణ దీక్షా శిబిరం వద్ద శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్మిక కుటుంబ సభ్యులతో ధర్నా, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అధిక సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీఈ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుతి, పి.నాగేశ్వరరావు, ఇతర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

గోపాలపట్నం: ఎస్సీలను ఏబీసీడీగా వర్గీకరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి విశాఖ జిల్లా సమావేశం శుక్రవారం గోపాలపట్నం లక్ష్మీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ సాధన అంశంపై మాట్లాడారు. మాదిగ రిజర్వేషన్ కోసం చుస్తున్నా పోరాటాలు ఆగవన్నారు. జిల్లా, వార్డు కార్యవర్గాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని ద్వారా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు పి. ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఐడీ బాబు, చెంగల చిన్నారావు, నత్తల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

గోతులమయంగా రహదారి



గోపాలపట్నం శ్మశానవాటిక వద్ద అధ్వానంగా రోడ్డు

గోపాలపట్నం: స్థానిక శ్మశానవాటిక వద్ద జంక్షన్‌లో బీఆర్‌టీఎస్ రహదారి గోతులమయంగా తయారైంది. రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోడ్ల కూడలి కావడం వల్ల వాహనాలు ఒక్కసారిగా వేగాన్ని తగ్గించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారిని బాగు చేయాలి.
– వాసుదేవరావు, గోపాలపట్నం

విద్యుత్ లైట్లు వెలిగించండి



మద్రిపాలెం వుడా లేఅవుట్ రోడ్డులో వెలగని విద్యుత్ లైట్లు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లేఅవుట్‌లోని శివశివాని పాఠశాలకు వెళ్లే రోడ్డులో పలు విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. ఇక విద్యుత్ స్తంభానికి లైటు లేదు. ఇక్కడి సబ్‌స్టేషన్ వద్దే ఈ పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు పరిశీలించి విద్యుత్ లైట్లు వెలిగించాలి.
– కనకరాజు, మద్రిపాలెం వుడా లేఅవుట్

వ్యక్తిని బెదిరించి నగదు అపహరణ

- అడవివరంలో ఘటన
- సీసీ పుటేజీ ఆధారంగా ముగ్గురి అరెస్ట్

సింహాచలం: వ్యక్తిని బెదిరించి...ఏటీఎంకి తీసుకెళ్లి నగదు అపహరించిన ఘటన జీవీఎంసీ 98వ వార్డు అడవివరం జంక్షన్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వరరావు(25) నేవల్ డాక్‌యార్డులో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. ఉమామహేశ్వరరావు గురువారం చీడికాడవెళ్లి తిరిగి రాత్రి సుమారు 10గంటల సమయంలో వెంకోజీపాలెం వెళ్తూ అడవివరం జంక్షన్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో మద్యం సేవిస్తున్నాడు. అక్కడికి ముగ్గురు వ్యక్తులు ఆటో, ద్విచక్రవాహనంపై వచ్చారు. నగదు ఇవ్వాలని ఉమామహేశ్వరరావును బెదిరించారు. బలవంతంగా బైకుపై అడవివరంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్దకు తీసుకువెళ్లి ఖాతాల్లో ఉన్న రూ.4 వేలు విత్‌డ్రా చేయించి తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. దీంతో ఉమామహేశ్వరరావు కంట్రోల్‌రూమ్‌కి ఫోన్ చేసి విషయం తెలిపాడు. సమాచారం అందుకున్న పెందుర్తి క్రైం ఎస్‌ఐ సల్మాన్ బేగ్ శుక్రవారం ఉదయం అడవివరంలోని మద్యం దుకాణం పరిసరాలతో పాటు అలాగే యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద పరిశీలన జరిపారు. సీసీ పుటేజీల ఆధారంగా ముగ్గురిని గుర్తించారు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఇద్దరిని, ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఒకరిని గుర్తించి అరెస్టు చేశారు.

అంతర్జాతీయ విద్యకు ఏయూ ప్రోత్సాహం

బీచ్ రోడ్డు: అంతర్జాతీయ విద్యను ఏయూ విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో ప్రోత్సహిస్తున్నామని వర్సిటీ రెక్టర్ మమత తెలిపారు. శుక్రవారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో జరిగిన ఇండో–యూకే ఎడ్యుకేషన్ ఫోరం సదస్సును ఆమె ప్రారంభించారు. అనంతరం రెక్టార్ మాట్లాడుతూ అంతర్జాతీయ విద్యను ప్రోత్సహించడంలో భాగంగా అనేక విదేశీ విద్యా సంస్థలతో ఎంవోయూలు చేసుకుంటున్నామని చెప్పారు. శుక్రవారం కూడా యూకేకు చెందిన రెండు యూనివర్సిటీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా ఏయూ ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా యూకేలో అందిస్తున్న కోర్సులపై అవగాహన కల్పించారు.

కమనీయం.. అప్పన్న కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

మద్దిలపాలెం: దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం అమలు చేస్తున్న డ్రైడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ రత్నం కోరారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో శుక్రవారం ఆయన పరిశీలించారు. జీవీఎంసీ యాంటి మలేరియా బృందం చేపడుతున్న చర్యలను తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాల్లో ఉన్న నీటి నిల్వల్లో లార్వా ఉన్నదీ లేనిదీ గుర్తించాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారం పైగా నీరు నిల్వ ఉంటే దోమల ఉత్పత్తి అవుతాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ కె.ఎన్.శ్రీనివాసరెడ్డి, రాముునాయుడు, శేషులు, యాంటి లార్వా బృందం సభ్యులు పాల్గొన్నారు.